


మణిమేల నాగేశ్వరరా

క్రొత్త రాగం

—మణి మొలనాగేశ్వర్రావ్.

ప్రచురణ :

రాజా పబ్లికేషన్స్

13/107 జగన్నాథపురం

గుడివాడ కృష్ణాజిల్లా (ఎ. పి.)

రైతురాగం

ప్రథమ ముద్రణ: ఆగష్టు 1981.

వెల: రు 7/- లు

ముద్రణ: శ్రీ హరనాథ్ ప్రెస్. గుడివాడ.

ప్రతులకు: గ్రంథకర్త
13/107 జగన్నాథపురం
గుడివాడ, కృష్ణాజిల్లా (ఎ. పి.)

పరిచయం

ఆంధ్రసాహిత్యంలో భావకవిత్వం ఒక మహోద్యమంగా విజృంభించిన తరవాత కవులదృష్టి రాజాస్థానాలనూ, సంకీర్ణ నాగరిక జీవితాన్నీ వదిలిపెట్టి ప్రశాంతమైన గ్రామసీమలవైపు ప్రసరించింది. అందమైన పల్లెలలో ఆనందంగా జీవించే పేదరైతుల బతుకులను చిత్రించటానికి కవులు పూనుకున్నారు.

ఈ పరిణామానికి దువ్వూరి రామిరెడ్డిగారి కావ్యం "కృషీవలుడు" నాంది పలికింది. గేయకవిత్రయమని ప్రశంసించదగిన బసవరాజు అప్పారావు, నండూరిసుబ్బారావు, అడివి బాపిరాజు సామాన్యజనులు పాడుకునే వరసల్లో వాడుకునే తేనెమాటల్లో కర్షకజీవితాలలోని లలితశృంగారాన్నీ సరళహృదయాలలో మెదిలే కోమలభావాలనూ, ఆశా నిరాశలనూ, సుకుమారంగా, స్మరణీయంగా చిత్రణచేశారు. ఎంకీనాయుడుబావల ప్రణయాన్ని ఉదాత్తభావాలతో మధురమైన శైలిలో పాటలుగా నండూరి తీర్చిదిద్దారు. అదే మార్గంలో పయనించి కొనకళ్ళ వెంకటరత్నం బంగారిమామ పాటలు రాశారు.

ఇన్నాళ్ళకు శ్రీ నాగేశ్వరరావ్‌గారి "రైతురాగం" చదువుతుంటే ఆ సత్కవుల సరసన సగర్వంగా నిలవదగిన రచన చేశారనే ఆనందమూ సంతృప్తీ కలుగుతున్నాయి. పాడటానికి అనువైన రచనా విన్యాసం. సులువైన మాటల్లో విలువైనభావాలు పలికించగల చాతుర్యం. పదకవితకు ప్రాణసమానమైన మాధుర్యం, సంయమనం. అల్పాక్షరాలతో అనల్పమైన శబ్దచిత్రాలను కళ్ళకు కట్టించే నైపుణ్యం. కేవలం నినాదమే కవిత్వం కాదు. ఆవేశంతో అనుభూతితో రంగరించినప్పుడే వాస్తవాలు కావ్యవస్తువులై శబ్దాలు రసాబ్దాలు కాగలవు.

II

ప్రబోధాత్మకంగా సాగిన రెండు మూడింటిని మినహాయిస్తే "రైతు రాగం" లోవున్న ఖండికలు భావస్ఫురణతో సుకుమార సుందర రూపంతో అలరారుతున్నవి

మట్టిలోంచి బంగారం వెలువరించే రైతుకు మట్టిమీద మమకారం ఎందుకో "అన్నప్రాసన" గేయంలో అపూర్వంగా చెప్పారు.

"మన్ను తిన్నది మమ్మ
వేవిళ్లకై కాదు
కడుపులోనే నాకు
అన్నప్రాసన సాకు"

ప్రకృతి దృశ్యాలను సొంత కళ్ళతో చూసి సొంత గొంతుతో వినిపించటంలో కవి విశిష్టత గోచరిస్తుంది.

"సుడిగాలి వాటులో, జొన్న పెనగుతువుంటె
కన్నకడుపూ భూమిc, దుమ్మెత్తిపోసింది"
"రేయి గుండెన వూరు, పక్క చుడతావుంది
బల్లు గిరిచిన తీరు, చప్పుడవుతావుంది"

శృంగారభావాల ప్రకటనలో పచ్చిదనంలేని వెచ్చదనం సాధించారు నాగేశ్వర్రావ్‌గారు.

"నెలవంకలా కళ్లు, ఉలులు సోకిన వొళ్ళు"
"గుండె కాజేసింది, నిప్పు రాజేసింది"
"సిగ్గు మొగ్గలు వేసె, సెక్కిళ్ళ గుంటలు
నవ్వ్వులే పువ్వులు, నా పిల్ల సొమ్ములు"

III

రైతుల జీవితాల్లో శాంతి కాంతి సంక్రాంతి ఇంకెప్పుడు వస్తుందో అని ఆశాభావంతో నిరీక్షిస్తున్నారు కవి.

"అశరీరవాణి

నా బాణి

నిత్యకళ్యాణి

నా మాగాణి"

అంటూ సాహిత్యక్షేత్రాన్ని తన కలంతో హలంలాగా దున్ని నవ ధాన్యాలు పండించగల కవి కర్షకుడు నాగేశ్వరరావ్‌గారు.

ఆయన లేఖిని ఇంకా పదునెక్కి ఆయన హృదయం మరింత రసార్ద్రమై ఆయన భావన ఇంకా ఉన్నత శిఖరాలు ఆరోహించి ముందు ముందు ఇంకెన్నో తేనెలూరే తేటపాటలు తెలుగువారికి అందించాలని నా ఆకాంక్ష. తొలికావ్యంలో విరిసిన ఇంపుసొంపులకు మురిసిన నాకు ఆయన గేయకవిగా విశిష్టస్థానం సంపాదించుకోగలరనే విశ్వాసం.

—అమరేంద్ర

అంకితం

ముగురమ్మలకే :

రాపఁమ్మ

రత్తమ్మ

అత్తమ్మ



విఘ్నేశ్వర ప్రశంస

ఎలుక నెక్కావులే
చిక్కు తీరా నాకు!
అమ్మకైనా చెప్పి
బసవన్న విప్పు !
పంటపై ప్రాణాలు
పెట్టుకున్నా నని
ఆకు అలమూ యేరి
కోరు కున్నావా ?
ఆశ లీనే కసవు
బాస లేనీ పశువు
చవితి చంద్రుని కాంచ
అచ్చు కుంటావా ?
ఏడాది కో పూట
నీకు పెడితే పోదు !
ఏటెల్ల పాడినా
ఎంత మందో చూడు !

యక్ష ప్రశ్న

ఎవరిదో యీనింగి ?
ఎవరిదో యీనేల ?
పిట్ట గూడెట్టింది
మనిషి మేఁడేసింది !
కొండ కూసున్నది
సాగరం పడుకుంది !
మేఘాలు తిరిగేది
గాలి కౌగిటిది !
సూరన్నదా లేక
చంద్రన్నదా ?
వీరన్నదా లేక
మీరన్నదా ?
ఈ నింగి ఈ నేల
ఎవరిదో ? ఎవరిదో ?
ధర్మజుడు వోడేది !
మృత్యువే మ్రింగేది !

భూదేవి స్తోత్రం

వేదాల నడిగాను
భూదేవి మల్లీ
భూతమ్ము లన్నింట
నీవు మిన్నే నంట !
పాదాలు కడిగాను
నదుల నీరాపి
మబ్బులను ముడి పెట్టి
గుడి కట్టినాను !
కాలేదు కడతాను
కదలకే తల్లీ !
ఈత కొచ్చిన పంట
పడకుండ యే కంట !
హారతిదె పడతాను
భారతిని చూపి
నిప్పు గుప్పెట పట్టి
కొడిగట్ట నీను !

నా తెలుగు తల్లి

జనమ జనమను
నేను నీకె పుట్టాలని
కలలు కనుకున్నానె
నా తెలుగు తల్లి !
గోదావరీ క్రిష్ణ
తుంగభద్రా పెన్న
నీళ్ళ పాతళ్ళమ్మ
నా తెలుగు తల్లి !
నన్నయ్య త్యాగయ్య
సిద్ధేంద్ర క్షేత్రేంద్ర
కళల లోగిళ్ళమ్మ
నా తెలుగు తల్లి !
శ్రీముఖ బ్రహ్మన్న
మల్లమ్మ రుద్రమ్మ
కనగ దుర్గమ్మ వే
నా తెలుగు తల్లి !

సిరిపురం

సిరి పురమ్మా లోన
చింతేవిఁటమ్మా?
ఇంటింట గరిశెలు
కుండల్లొ అరిశెలు!
పచ్చి బాలింతగా
గో మాత వుంది!
కోడిపెట్టా పురుడు
పోసుకుంటంది!
రెండు గాళ్ళెద్దులు
చరగన్ని హద్దులు!
నిమ్మ చెట్టూ వుంది
దానెమ్మ వుందీ!
గుడి వుంది, బడి వుంది
చెఱువు, సత్రం వుంది!
అందరూ రైతులే
ఆనంద చరితులూ!

భువనైక

ఊరు సుట్టూ సుట్టి
వాగు పడ గిప్పింది !
ఊరిలో నాగన్న
ఇల్లు మావిఁడి గున్న !
మొండి కొండా కాదు
మండవా లోగిలి !
బసవన్న మొగసాల
బావిలో గంగా !
కాకి నెమిఁలీ డేగ
పొదుగు కుమ్మే లేగ !
పురుల వాఁవుఁల నీడ
దోగాడు సిరులు !
గొఱ్ఱె మేకా గేదె
ఆవు అంబా అరులు !
బళ్ళ నాగళ్ళ పై
అరటి కొబ్బరి తరులు !

సుప్రభాతం

కోడి కూసింది రా!

కాకి లేసింది !

కవ్వ మాడింది రా !

రోలు పాడింది !

వెన్నెలా ముద్దోయి

వెన్న ముద్దోయి

కోశేరు పన్నగా

కునుకు ముద్దోయి !

రేయి గుండెన వూరు

పక్క చుడతా వుంది

ఒళ్ళు విరిచిన తీరు

చప్పు డవుతా వుంది !

వెన్నెల్లో వెలుతురు

కలిసి పోతా వుంది !

తుమ్మల్లో బొమ్మలా

ముసుగు లాగింది రా !

రైతు

ఇంతటి బ్రతుకు
ఇల్లో వుందని
రాదులె కొందరి
కల్లో కైనా!
పంగలి కొయ్యను
నాగలి చేసి
ఆకలి కాసిన
వైతాళికుడు!
జంతువు చూసి
మచ్చిక చేసి
మొడ కాడేసిన
యాంత్రికుడు!
తంతూ తిరిగే
భూమిని దుంతూ
చెలి బట్టాడు
ధర గట్టాడు!

పోరాటం

నర నరాలు ముళ్లేసుక
తర తరాలు వల్లేసుక
ఎద్దుల్ని మళ్లేసుక
పోతున్నా పొలానికి !
సూర్యుడికే ముసు గేసిన
కోట మంచు చలిమిరి గోని
నీటంచున రేగడిలా
పోతున్నా పొలానికి !
నెత్తురు జిల గొట్టుకోను
సత్తువ వెల గట్టుకోను
ఆకలి మెడ పట్టుకోను
పోతున్నా పొలానికి !
అట్టుడికే యెండన పడి
పొయ్యి పైన మసలు తున్న
పాల పైని మీగడి లా
పోతున్నా పొలానికి !

ఆడ గూతురు

మెరక చేనికి నేను
అర కేసు కెలితేను
అక్కడికె ఆడది
కూడు తేవాలి !
గొట్టు నే పడుతుంటె
ఆలి మొద పెడుతుంటె
దారి నెళ్లే వాడి
కళ్లుగుట్టాలి !
నెయ్యి కారము వేసి
తైద ముద్దా చేసి
నంజు కొమ్మన గుడ్డు
పుంజు కుంటాను !
ఆడ గూతురు అండ
దండిగా నా కుండ
కన్న కడుపుకు నేను
దండ వేడుతున్నాను !

తిథి నక్షత్రాలు

తొలకరిలో వొక జల్లు
చిలకరించుకు వెళ్ల
మట్టి కరిగిన, సు
వాసనలో పుట్టాను !
ఎక్కడిదో వో పాట
గాలి కలిసే చోట
ఇంటి కెళ్లే దూడ
గంట మోగింది !
వడిగళ్ళ ముత్యాలు
ఎనలేని సత్యాలు
మట్టి లోనే కలిసి
చాటి పోయిన వట్టె !
రంకేసి ముసిలెద్దు
కాలు దువ్విన వేళ
చేలోనె పుట్టాను
తొలి రెప్ప కొట్టాను !

అన్న ప్రాసన

అమ్మ కడుపున వూడి
పుడమి పై పడ్డాను !
ఒత్తు కున్నా తల్లి
ఎత్తు కున్నట్టుంది !
మన్ను తిన్నది మమ్మ
వేవిళ్లకై కాదు !
కడుపు లోనే నాకు
అన్న ప్రాసన సాకు !
అంత కమ్మని భూమి
కౌగిలిం తింకేమి ?
ఈసారి పొల మెల్లి
దుక్కి లో దొర్లాలి !
పుట్ట చెట్టూ నీడ
పూలు రాలే కాడ
నాగు తిరిగే జాడ
నే గాలి మేయాలి !

అన్నపూర్ణ

పొద్దునే బొట్టెట్టి
కడలి అద్దం సూసి
భూదేవి కొప్పులో
కంకి తురిమింది !
ఋతువులు చీరెలు
రేయి పగలే నగలు !
ఏ తేషుకో రాణి
వెన్నె లంతా వగలు !
సంధ్య ఛాయల మల్లె
ముద్దబంతీ వొల్లు
అన్న పూర్ణంటేనె
నోరూరు తుంట !
పొద్దు పోయే దాక
నేల సొగసులు సూసి
నింగి నెలబాలుణ్ణి
సంకేసు కుంది!

పోటీలు

ఆ వచ్చేది
రైతు బిడ్డలు
అందరివీ, నీరు
కావి గుడ్డలు !
పరికిస్తున్నారు
పైరు, ఖడ్డలు
ఝళిపిస్తున్నారు
చేతి కఱ్ఱలు !
కడుతున్నారు
పంట దిగుబడి
పెడుతున్నారు
ఊరి కొరవడి !
ఎంత బావుంది
వారి చందం !
పడుతున్నారు
ఏదో పందెం !

పెత్తందార్లు

పాల బట్టల దూడ !
యల్ల వన్నెల కోడె !
కాడి కలిపితె చాలు
కనకాభిషేకాలు !
పట్టండి రాజాలు
బండి కిటకిట లాడ
మెచ్చాలి పోట్టేలు
అరగాలి పట్టాలు !
ఉరకండి వడి వడిగ
పురుగు పుట్రా వుంటె
డోలుపు కిందే వుంది
కావంగ మన కుక్క !
చాలింక పోకిళ్లు
ఉడికుండు గుగ్గిళ్ళు !
అమ్మ పిలుపదిగోను
మలుపు తిరగండి !

సుడిగాలి

సుడిగాలి వాటులో
జొన్న పెనుగుత వుంటె
కన్న కడుపూ భూవిఁ
దుమ్మెత్తి పోసింది !
కళ్లు కనబడకేవోఁ
సుళ్లు తిరుగుత వుంటె
జుట్లు ముడిలిడి పోయి
శెట్లు శివ మెత్తాఁయి !
ఆకులు శాకులు
ఒగుడాకు యీకలు
నింగిలో రంకులా
రాట వేఁకాట్టాయి !
ఊపు సీపురు దెబ్బ
దుమ్ము దూపంతోటి
గాలి గుమ్మట వెఁళ్లె
శదలేటి కేసి !

చంద్రుడు

చదువు కున్నావాణ్ణి
సంస్కార మున్నోణ్ణి !
కలము హాలములుగన్న
కులము వాణ్ణీ నేను !
నా చేను పూసింది
పుష్ప రాగములు !
బంతిపూలూ చూసి
చుక్కల్లు సిగ్గిల్లె !
నా చేల వెలుగుల్లో
ఈ పూల నవ్వుల్లో
మంచె కట్టీ నేను
చంద్రుణ్ణి అయినాను !
గ్రహణాలు లేకేమి ?
అతి వృష్టి మృతి వృష్టి
అనుకుంటె అమవాస
కాటకమ్మే నాకు !

అమాయకుడు

చందమామలో చెట్టు
నాటింది నేను రా !
సూర్యు డంటే గొడుగు
పట్టింది నేను రా !
చంద్రు డంటే యెవడు ?
సూర్యు డంటే యెవడు ?
నా కుంటలో నీళ్లు
తాగి పోయే వాళ్ళె !
ఆకలేసీ వాళ్ళు
ఎంత కేకిడ పోతె
నా గింజలతో మీరు
నైవేద్య మిడతారు !
లోకాలు యేలేటి
కిరీటమే నేను !
నాకు యెండే కాక
నీడెలా వుంటుంది ?

వాస్తు శాస్త్రం

ఇవి నా విధులు
అయినా నిధులు !
పుడితే బదులు
కడితే వోదులు !
చేనికి మంచ
చుట్టూ కంచ
తలగడ బావి
నిలబడ మావి !
ఇంటికి అరుగు
అంటిన పొరుగు
ఊడని బెరడు
కూడిన పెరడు !
అరకా చరఖా
ఆవూ మ్యావూ
కుక్కా కోడి
ఒక్కటి చాలదు !

ముల్లు గఱ్ఱ

కఱ్ఱ లేనీ వాని
గొఱ్ఱె కరిచేను !
చేత కఱ్ఱా లేదు
రైతు నంటాడు !
శివు నంతటీ వాడు
శూలమ్ము పట్టేను
ముద్దు ముద్దుగ నంది
నదలించు కోను !
ఎద్దులను గిల్లినా
హద్దులను కొలిచేను !
ముల్లు గఱ్ఱే కాదు
అది రైతు విల్లు !
ముల్లు గఱ్ఱతో రైతు
మూర్తీభ వించాలి !
ఫాలాక్షుడే దోయి !
పట్టి చూస్తా ననగ !

నా భూమి

ఈ భూమి ! నా భూమి !
మబ్బు లేలే భూమి !
ఒక్క తడి కడితేనె
పిడుగు రాలే భూమి !
లోక మెరుగని యీడు
దోగాడు నాడే
అన్నానికి మున్నె
నిన్నె తిన్నా మన్నుఁ !
ఎన్ని చదువులు వున్న
ఏ కొలువు కొలిచినా
నిన్ను విడిచీ నేను
సామెలా చేసేను ?
నమ్ముకున్నా దమ్మ !
నాకు నచ్చిన సొమ్మ !
నీ కడుపులో నుంచి
నిధులు వెల వాలమ్మ !

ఏరువాక

సాగాను ! సాగాను !
ఏరువాకా నేను !
ఊరూరు కదిలింది
భూమాత మెదిలింది !
విత్తులను వొండేసి
గిత్తలకు రంగేసి
ఇల్లాలు యెదురైన
యెల్లాలి పొలము !
కాలువలు త్రవ్వినా
మన మెంత త్రొవ్వినా
అమ్మోరి గుడి కాడ
అరక నిలవెయ్యాలి !
ఈనాటు వోనాడు
మేడి మొలకేసింది !
తొలి చాలుకే నేడు
సీతమ్మ దొరకాలి !

అమరగానం

దోరెండలో కొండ
కొండ దాటిన బండి
బండిలో సిన్నోడు
పాడుతున్నాడు !
మువ్వలూ గంటలూ
పక్క వాయిద్యాలు
ఎంచక్క మోగాయి
ఎడ్ల నడకల్లో !
కుదుపులే మద్దెల
ఇరుసు కిసకిస బూర
కొండ కొమ్మున గూడు
బండి పోయే పల్లె !
కాన గోలను మింగి
పాట తేనెలు తాగి
ఏరు కౌగిలి చేర
కునికింది లోయ !

యల్లగిత్త

తెల్ల తెల్లని దూడ
కల్లు లేనీ కోడె !
సుళ్లేమిటో గాని
సల్లెక్కడా లేదు !
వరదైన బురదైన
ఒళ్ళు దాచని దూడ !
కళ్ళు వురిమా డంటె
బళ్ళు దిగబడ వింక !
తెనాలి వీధుల్లో
వినాలి వీడి కథ ;
పందెంలో గెలిచాడు
మనిషిలా నిలిచాడు !
కాలెక్క డిరిగేనో ?
కొమ్మెక్క డిరిగేనో ?
బీటిలో వొంటిలానో
పోటీల కెలతాడు !

పుల్లగిత్త

పాల బట్టల దూడ
అంగ వైఖరి చూడ
నందికేశుడు గూడ
తలదించు కుంటాడు !
రమ్మంటె వస్తాడు
పొమ్మంటె పోతాడు !
తెలిసి నట్టే యేదో
తల తిప్పుతుంటాడు !
ఏ పొద్దు లోనైన
ఏది చప్పుడు అయిన
బుసకొట్టుతూ తాను
పసిగట్టి పెడతాడు !
నే వూరు వెళ్లానో
వీడికే దిగులంత
వచ్చి వేసే దాక
నోట పట్టడు మేత !

దారెంటి

ఊళ్లోన వుంటేను
ఊపి రాడదురా !
పొలాని కెల్లాల
పాలు పోవాల !
సాకిరేవూ కాడ
సక్కన్ని వోసిలక
కండల్ని కట్టేసి
గుండెల్లో దాసింది !
కాల్లాడకా యేరు
సుళ్ళు తిరిగింది !
పిల్ల గాలికి వొల్లు
సలపరించింది !
యేటి నురగలు సూసి
మెల మెలా బోతుండె
గట్టుపై గోరింక
నింగిలో నెలవొంక !

కాపు

దొంగ పసి కట్టేది
నా పుల్ల గిత్త
పైన పడి పొడిచేది
నా గొఱ్ఱె పోతు !
దోర వయసు కోర చూపు
పిల్ల పేరు మల్లెమొగ్గ !
తలబిరుసు నోరు దురుసు
అమ్మడి నడువుఁ గుమ్మడి తొడెవుఁ !
పాడుకుంటే తన కేంటో ?
ఉలుకెల్ల యల్ల బోసి
గిల్ల బోతే ముద్దబంతి
గుమ్మడి పైన గొఱ్ఱెకుమ్మొ !
విరగబడి తిరగబడి
రైకముడి కోక చెడి
జాంపళ్లోయ్ ! గుమ్మడి కాయలు !
గుమ్మడి పళ్లోయ్ ! జాంకాయలు !

సూపరి

జంట కడదా వంట
కంట సూపెట్టింది !
నెల వొంకలా కళ్ళు
ఉలులు సోకిన వోళ్లు !
సేని కెన్నడు రాదు
దారి కొచ్చె సోకు !
సెజువు కెప్పుడు రాదు
యీ దింత నాజూకు !
నా వయసులా నీదు
మనసుకూ సోనీదు !
కాళ్లు సేనికి లాగ
సెజువామె కళ్లు !
మెద తీపి కోతలో
మోపెత్తనే లేదు !
కడసారి సూపంది
కడవెత్త బోతే !

మూగమనసులు

అందాలు మాటల్లో
మూట గట్టే వేళ
తుమ్మ మొద్దున తొండ
కొంటె బంధాలు !
వాగు వొంకల్లోన
ఒళ్ళిరుచు కుంటుంటె
కొసిరి కొసిరీ గువ్వ
కూని రాగాలు !
వాగొడ్డు తుమ్మలు
ఎరగనట్టే ముసిరి
ఒక్కొక్కటే విసురు
నీలపై పూలు !
మెల్లగా వాగెల్ల
చెఱువు గుండెలు పూరు
ఆకాశమే వొంగి
అరగన్ను వేసి !

గుండె గోడు

గుండె కాజేసింది
నిప్పు రాజేసింది !
కోకిలై కూసింది
కొంప తీసింది !
నింగి దీపం బెట్ట
గాలి వీవన లీసె
నేల జోల పాడ
నిదరెట్ట దాయె !
తెల్లారి పోయింది
బోసి కొడతా వుంది
గుండె లేని గూడు
ఆకురాలిన మోడు !
అమ్మ నవ్వుతోంది
ఆవు లా వుంది !
మొనకెవ్వరో దాగి
తొంగి సూశారు !

వసంతాకృతి

మనసులో నాకేదో
ఊసు వొ_స్తంటది
శెట్లునో శామనో
సూసి నట్టుంటది !
యేటి వొడ్డున యీత
జుట్టు యిరబోసింది !
యేటి నీటిలొ సోకు
సూసుకుంటంది !
యేరు నవ్వింద్ దేవోఁ
గల గలా యినపడది !
సం|దానికీ యింత
సెప్పి నవ్వి_స్తది !
యిడి సేసి గుడ్డలు
శెట్లు నిలబడ్డయ్యి !
యెన్నెల్లొ ఆకులు
వుత కేసుకున్నయ్యి !

మ డి సి

కలకాదు సెప్పేది
పచ్చి నిజవంటాది !
గుండె సేతికి తీసి
ఆడుకుంటాది !
తల సుట్టె కనికట్టు
కట్టె మెడపై బట్ట !
కిట్టు సెప్పలేవు
కట్ట వేణువు కాదు !
కంట బడ్డా నంట
గట్టు నోచ్చె యేల !
తనువు లోతులన్ని
తవిఁడి నట్టుందంట !
నీ ఆలికా పోతె
ఏటికే బతుకంది !
కల్లోకి ఎల్లి నే
కోల్ల గొట్టానంట !

ఇంటిదారి

కొండల్లో పొద్దు పడింది
గుండెల్లో ముద్దాడింది !
ఇంటిగాలి వొంటికి సోకి
పైరగాలి లీలలు సాగి !
చేలల్లో సిరిగర లాడి
తోకలేపి గెంతగ దూడ
గొర్ల మంద బెదిరిందోయి !
డొంక గట్ల పొర్లిందోయి !
దారులన్ని కోటేరులతో
పాముల్లా పరుగెడుతుంటే
మబ్బులన్ని లేబిట్టలతో
వాముల్లా వెనకడ్డాయి !
మెళ్ళల్లో గంటలు మోగి
ఇళ్ళల్లో దీపా లెలిగి
దారి కళ్ళు మూసిందోయి !
ఊరు కళ్ళు తెరిసిందోయి !

త్రేనెసినికులు

జంట పిట్టల మల్లె
శెట్టు లెక్కాలంట !
సెలయేట జలకాలు
ఆడుకోవాలంట !
గాలి తగలాలంట
ఊపిరాడాలంట !
శెట్టుల్లో గుట్టల్లో
పండు కోవాలంట !
సిగ్గు మొగ్గలు వేసె
సెక్కిళ్ల గుంటలు !
నవ్వులే పువ్వులు
నా పిల్ల సొమ్ములు !
నేల నవ్వాలంట
నింగి సూడాలంట !
సేల కవుగిళ్లలో
శెట్లు వూగాలంట !

నేలపగులు

ఓడల్లె వూడల మఱ్ఱి
దాని కిందవాడూ నేను
వాడంటే జతగాడు
వాడు లాడుతున్నాడు
జల జల చినుకులు
రాలేటప్పుడు
భూదేవి పులకించిందంట !
గడ్డి నిక్క బొడిచిందంట !
భూమి నెత్తు కెల్లాలని
సుడిగాలి వొచ్చాడంట
భూదేవి అలివి గాక
వాన తన్ను కెల్లాఁడంట !
కిఱ్ఱుమని భూదేవి
నెత్తి గొట్టిందంట !
వాన దేవుడంట
భూదేవి మొగుడంట !

అంకితాలు

అన్నయిన అబ్బయిన
అన్ని నేనే నంట !
సెల్లెయిన తల్లెయిన
యెన్నెన్నొ తానంట !
యిడ లేని బంధాలు
యెన్ని సంబారాలు !
ఆలి కళ్ళల్లోని
సెల్లి ఋణాలు !
ఏ జనమ పున్నెవోఁ
ఏ మేల కాయాల
ఆలి వొయినం లోని
తల్లి పేణాలు !
తమ్ముడో నేనంటు
తలపాగ సుట్టింది !
కన్నీలు తుడిసింది
కావలించింది !

ఐందు

ఆంధ్రాలో అడుగు పెడుతూ
కాంచిన వంటకాల దృశ్యాలా
వేరు శనక్కాయల తంపటి
ఊచ బియ్యం వేపే కుంపటి !
రేకుల్లాగి కాల్చుకున్న
మొక్క జొన్న గుండెలు !
గాల్లో మసాల కలిపే
చేల్లో కొతిమేర మండలు !
కంది కొమ్మ శనగ రెమ్మ
తంపటి కుమ్మున దూర్చి
ఆఖరి గింజ కోసం
అందరం బూడిద చెలిగాం !
దోసకాయ దొప్పల్లో
మేక పాలు పితికారు
ఆంధ్రా ఫలహార శాల్లో
పదార్థాలు అమూల్యాలు !

కాపలా

చొక్కా లేదు నా వొంటికి
కాపలా యెందుకీ పంటకి
అటుపోతే నక్కల బాడవ
ఇటుపోతే కుక్కల నడవ !
కాలికింద పాసగనంట
పుచ్చకాయ బెసుకు తుంటె
కిందపడితే కుట్టు కళ్లు
ఎర్ర బార మిరప్పళ్ళు !
పరుగు పడితే గుంటెలు
చెండు తుండు కండెలు !
ఎదురు కొట్టు బడవల
గుమ్మడికాయ కడవలు !
లక్ష్మొచ్చిందీ మధ్యనె
నాట్యం చేయటానికి !
పాము లొస్తయి రోజూ
పిలుచుకు పోవటానికి !

గాలి ఉయ్యాల

మంచెపైనా మనకు
జాబిల్లి దిండంది !
సుక్కలన్ని చూసి
పక్కేసి నాది !
ఈ రేయి నాదంది
గుండె తడివింది !
గాలి వుయ్యాల్లోన
ఊగి పోయింది !
కారు పిల్లం రిసింది
గుండె కరిసింది !
ఈ రేయి నీదంది
ఏలుకో మంది !
కారు పిల్లరిసింది
మారు పిల్లరిసింది !
తొలికోడి కూసింది
శంప కరిసింది !

జలకాలాట

సుక్క దూకిందంటె
అప్పుడే అనుకొన్న
యిక్కడుండా యని
ఇప్పుడే కనుగొన్న !
సెర్లోకి దిగిరావు
సుక్కలెంతా సేపు
సూసి పోదావంటె
సక్కనీ సుక్కల్ని !
ఇటుకేసి వొస్తాదో ?
నింగి నేలకు వొంగి
సందకాడా యాడో
యెతుకు తుండాది !
గాలి గుసగుస మంది
సెఱు వొణుకుతా వుంది !
సిన్న మొగ వేఁసుకొని
సెంద్రుడే తగలడితె !

ఎండమావులు

సజ్జసేలో మధ్య
మంచె పిచ్చిక గూడు
కథ సెప్తూ తున్నది
కన్నుల్లో సిన్నది !
కలువగిన్నెల్లోని
మధువొలికి పోయె
సేనంత ! గల్లంతు
ఆ వెంట ఆబోతు !
లేడల్లె ఆడది
దడుసు కున్నాది !
గుండె కల కేసింది
వీపు తట్టింది !
రేయిరేయి తాను
పలవరించింది !
సేతులే కావంది
బతి మాలుతోంది !

మూగబాధ

సెలయేటి గల గలల
సొమ్మసిల్లే కొండ !
యేటి బొడ్డే బీడు
యెన్నొ పిట్టలు పాడు !
కొసిరి కొసిరీ తాను
ఉసురుసురు మంటుంటె
గుండె కొట్టుకు లాడు
యెడ్డు గట్టుకు సూడ !
యెడ్డు సూసే దట్ట
యెరిక సేయా నంట
మూగ బిడ్డల ఋణావుఁ
గడ్డితో తీరేన !
దారి నొచ్చే యేల
దొంగలల్లే సూసె
రైక సినిగిందని
పైట సూపిందేవాఁ !

కంటకాలు

గుడిశలో పస్తులుంటూ
వడిశాల తిప్పుతున్నావా తల్లీ !
అలనాడు నా పురిటికి నీచేయి
నెయ్యికారిందట జ్ఞాపకముందామ్మా ?
ఈనాడు ఆకలికి
నకనక లాడుతుంటే
తింటానికి ఎలుకతే
నయమంటున్నారు తల్లీ !
ఎందుకమ్మా ? అలా ఆకలితో
మెలికలు తిరుగుతావు ?
తాగెయ్ తల్లీ ! మబ్బులిచ్చే నీళ్ళన్నీ !
సముద్రంలోకి చుక్కపోకుండా !
ఆనాడు చూడు నన్ను
విశ్వమానవుడిగా యెదిగి
ఆకాశం మూకుడు చేసి
నిరతాన్నదానం చేస్తానేమో ?

వర్షాభావం

నీరసంగా వూరు పడుంది
కుక్కలైనా యేడుస్తుంటే
ఎవరికి పుట్టిన బిడ్డో ?
నాలుక కొరుక్కొంటోంది !
ఏదో వొక మబ్బుతునక
ఇటు కేసీ వచ్చేదనుక
దాహాలు తీర్చేనని
మొహాలు మాడ్చుకొని !
ఇంకెవరూ ? భగీరథులు !
తప్పిక తీరని రైతులు
లంకా పట్టణానికి
వారధి కట్టిన కోతులు !
ఎవడైనా వున్నాడా ?
ఎవడున్నాడీ నాడు ?
పాతాళ గంగ మీదికి
యుద్ధం ప్రకటించేందుకి !

కాలజ్ఞానం

కాకి గూడల్లింది
గోరింక పొదిగింది !
కొంతకాలం ఆగు
వాన వెనకాడేను !
గండు చీమలదాడి
కాళ్ళకిం దెళ్ళాలి !
తలపైన తుమ్మెదలు
దండుగా యెగరాలి !
బెడగొండలో మొయిలు
నాలుకలు కోరాలి !
ఇంద్రధనసున నారి
వరదలై పారాలి !
ఆకాశమే కప్పు
లేదు మనకే ముప్పు !
ఉన్నదంతా మనది
పంచుకుందాము !

కలుసుబాటు

గొడ్డు వచ్చిన వేళ
బిడ్డ వచ్చిన వేళ
కల వొచ్చినట్టుగా
కలిసి రావాలా !

పాల నివ్వని యావు
పాడవ నొచ్చే కోడె
కొత్త కోడలి చూసి
మెత్త బడ్డాయి !

మా యింట చిన్నది
నడయాడుతున్నది !
సిరులు మా యింటికే
తరలినట్టున్నది !

దోరావు కొన్నపుడు
కరువు తప్పింది !
తొలి సారి కన్నపుడు
కాలువలు పడ్డాయి !

సాగర దర్శనం

సాలీడు అల్లాఁడు
మానోసట గూడు !
చించు కొస్తున్నాడు
సాగరుడు నేడు !
కోడైన కూయలా
వడగాలి వీడలా
నెత్తినెత్తెకు పాకి
నీటి బుగ్గయినాడు !
మబ్బుల్లో మెరుపేది ?
ఉరుముల్ల అరుపేది ?
చూడ చిత్రం గుండు
భానుడికి తేడా !
గుడిలోని శంకరుడు
మానవుడు కాడు !
మదిలోని సాగరుడు
దేవుడయినాడు !

కుశలోపరి

నాగార్జునుడు నిన్ను
చూడ నంపాడా ?
కన్నీళ్ల తుడవగా
సాగ నంపాడా ?
చూడు !సాగర !చూడు !
ఆవు ముట్టదు నీరు !
పీడకలగా గతము
పొడగట్టు తున్నదో ?
గొంతుకెండిన దూడ
కొన ప్రాణముల తోడ
చెయ్యి నాకిన రైతు
గుండె పగిలిన రీతి !
తప్పిపోయిన చావు
కడుపుకాలిన గోవు !
ఆగు ! సాగర ! ఆగు !
పొలమారు తుందేమొ !

కార్యోన్ముఖం

పాట్లు తొలిగే నోయి
నాట్లు వొచ్చాయి !
మొక్కల్ని నాటండి
ఉగ్గు పోయండి !
సురులు అసురులు కలిసి
సాగరం చిలికారు
మానవుల మరచారు
స్వార్థ మెంచారు !
తిన మరిగిన మొద్దు
త్యాగ మెరిగేనా ?
కడుపు కాలిన గోవు
బిచ్చ మడిగేనా ?
సిగ్గెందుకూ యింక
ఎగ్గెందు కోయి ?
చిక్కాలు పెడదాము
పగ్గాలు పడదాము !

దొడ్డ బ్రతుకు

వందకి యెనభై మంది
భారతంలో రైతు పైన
ఆధారపడి బ్రతికేది
అతడు చెడితే చితికేది !
అందుకే ముందుగా
కాలువలు త్రవ్వాలి
రైతుకు రెండు పంటల
అవకాశం యివ్వాలి !
రైతు కేప్పుడూ
పని కల్పించేది నీరు
అతని కెప్పుడే
కావలసింది పనివారు !
చక్రమిలా తిరుగు తుంటే
సక్రమంగా వుంటుందేమో ?
ఆలో చించండోసారి
అంతా కలిసినప్పుడీ సారి !

సాగరా! లయం

సాగరా ! లయమంటె
ఎవడు కాదంటాడు ?
సత్రమైనా దంటె
కడుపుమంటే కాద ?
వాన పడ లేదన్న
పిల్లి హాయిలోవున్న
తాలూకా వాడొచ్చి
తలుపూడ పీకాడు !
పూజారి నిదరోతె
వార వోసీ రుధిర
బిందు బిందువు నేదొ
కుక్క నాకిందేవోఁ ?
మూడు వూపిరి పెట్టి
నీదు కోవెల కట్టి
నీ గుడికి పగులంటె
దిగు లెవడికో నంట !

కాలగర్భం

మట్టిగడ్డ రైతు బిడ్డ
గుండె కాదురోయ్ !
ఆ గుండె పగిలినపుడు
పచ్చి పుండు కాదురోయ్ !
నిప్పులు చెరిగే గాలిన
లేగ దూళ్ళు మాడెనే !
పాల చుక్క యింకిపోయి
పసిపాపలు వాడెనే !
కసిరికొట్టి ముసురు పట్టి
చంటి బిడ్లు చావబెడ్లు
డొక్కల్లో ముట్టె లెట్టి
ఆకల్నే పొదిగెనే !
ఆకురాలి మోడు తేలి
చిగురు వేసి కాయ కాసి
నోటికాడ పెట్టుకుంటె
పండంతా పుచ్చెనే !

చరిత్ర

ఎప్పటిదో యీ ధరిత్రి
అప్పటిదీ నా చరిత్ర !
యుగాదిగా నాగలి నాది
అనాదిగా మిగిలిన సోది !
అమ్ముకున్నానా ?
నమ్ముకున్నానే !
బాధలు కాల రాచినా
వరదలు నేల తొలిచినా !
పుచ్చుకున్నానా ?
ఇచ్చుకున్నానే !
ఆరుగాలమూ కోరికి నా బలం
తేరగానే అందరికీ ఫలం !
గుళ్లో గొల్లాడిలా
బళ్లో పిల్లాడిలా
బ్రతుకీడుస్తున్నాను
ఎద పీడిస్తున్నాను !

వే షా లు

ఎద్దన్నా ! వద్దన్నా
పరు గెత్తా వద్దు
నింపాది గెల్దాము !
నీళ్లే తాగేద్దాము !
గంతమ్మూ పునవేసి
గంగి రెద్దును చేసి
బంగారు నీ బ్రతుకు
బజారు కీడ్చారు !
ఎంగిలి చేత్తో కాకిని
తోలకుండ చస్తాడు
అన్న దాతవు నీవు
వాడికి ఆబోతువా ?
ఏక పత్నీ వ్రతుడు
దేవుడు అన్నారు !
రాముడికే నిన్నొదిలి
రంకు నేర్పు తున్నారు !

గణన

వస్తుంది ! వస్తుంది !
ఒక్క రోజొస్తుంది !
కాడి గట్టే వాడి
జాడ గుర్తొస్తుంది !
వస్తుంది ! వస్తుంది !
ఒక్క రోజొస్తుంది !
మేడి పట్టిన వాడి
గూడ గుర్తొస్తుంది !
వస్తుంది ! వస్తుంది !
ఒక్క రోజొస్తుంది !
ఎద్దు తోలే వాడి
బుద్ధి గుర్తొస్తుంది !
వస్తుంది ! వస్తుంది !
లోక మంతా వెదికి
నేల దున్నేవాడి
నీడకే వస్తుంది !

వాన ముందే వరద

పట్ట పగలే మేఘాలు
నల్లటి పెను గొండల్లా
చీకటి కడు తున్నాయి
పరుగులు పెడు తున్నాయి !
చుట్టూతా జొన్న చేలు
చూపు మేర కున్నాయి !
పసరు వాసన లీస్తూ
పరగణాని యేల్తూ !
హోరు గాలికి పైరు
అలలుగా పరుగేస్తూంది !
పరగణా పరగణా
సాగరంలా తోస్తూంది !
మామిడి తోట వొక్కటే
మధ్యలో తేల్తూంది !
పంచాంగంలో కుంభ వృష్టి
ఎప్పుడలివొతుందీ సృష్టి ?

పూలమాల

సాతి కొంగల బారు
శాంతాతులా వుంది !
ఆకాశమే మాల
అల్లు తున్నాడో !
మాల తెగిన లీల
ధరణికే ఆ పూలు
పచ్చ పచ్చని చేల
అక్కడక్కడ రాలు !
దోసిళ్ళతో చేలు
బంతు లాడాయి
విసిగి విసిగీ పూలు
ఎగిసి పోతున్నాయి !
మేఘాల కురులలో
మాల తురిమిందేమో
దిష్టి తీయగ సంధ్య
ఎఱ్ఱ నీళ్ళను కలుపు !

ఆత్మవంచన

చేలో కెక్కటంలా నీళ్లు
అలాగే వున్నయి బీళ్ళు
వస్తూనే వుంది వరద
పోవటంలేదు బురద !
అందరూ ఆసాములే
ఉన్నది శాసన సభలో
ఉంటారు అయిదేళ్లిల్లా
బెల్లం కొట్టిన రాళ్లల్లా !
ఎప్పుడైతే శాసన సభ్యులు
పుచ్చుకున్నారో జీతాలు
అప్పుడే అయిపోయారు
నిజంగా వుద్యోగులు !
మధ్యలో వుద్యోగిని
విధి నెరవేర్చక పోతే
దించడానికి హక్కు
ఎప్పుడాసామికి చిక్కు !

దైవాధీనం

రండీ ! రండీ !
సూడండీ గుడిశని
అందులో వుండే
మడిసిని !
అదుగో ! అదుగో !
అక్కడ !
కూసుంటాడు
ఒక్కడే !
కష్టపడతన్నాడు
ఇష్టపడతన్నాడు !
నిచ్చమూ గడ్డే
పచ్చమూ గొడ్డు !
ఇడుగో ! ఇడుగో !
ఇక్కడ !
వానచేతిలో
చిక్కడి !

పిట్టపోరు

కుటుంబంలో పెద్ద కొడుకు
కర్రపెత్తన వుచ్చుకోని
చూపినట్టు కర్రెత్తం
ఏలుతుంది ప్రభుత్వం !
ఆ పక్కన కాలవకి
బాగానే గండడింది !
చూస్తూ వుండగానే
చాలా పొరగొట్టిందే !
ప్రతిపక్షం శిస్తాసూలుకు
హక్కేదని అడుగుతంది ?
ప్రభుత్వంపై ఖర్చుకు
డబ్బేదని గొణుగుతంది !
వ్యాజ్యం పడిందంట
తెగేదాక వుంటే యెట్ట ?
పదండి పూడ్చుకుందాం
రైతుదే రాజ్య మందాం !

తత్వం

ఎద్దొకటి దున్నొకటి
జత కలవ లేదు
కలగలపు కూడులే
ఆ కడుపు గోడు !
దున్న అంకేసింది
ఎద్దు రంకేసింది !
గీక లేడే తల్లి
భూదేవి నీవొల్లూ !
అమ్మలేసి బరువు
కొనలేని అరువు
ఒకదానితో దున్న
తెర వేమిటమ్మా ?
ఎద్దునెక్కె శివుడు
దున్ననెక్కె యముడు
రెంటి నెక్కినవాడు
వీడెంతటోడు !

సిగపట్లు

మనము మనుషుల మేన ?
మట్టి బొమ్మల మేన ?
నిప్పెట్టినారు రో
దేశానికో యన్న !
అమ్మనమ్మేవాడు
ఆలి కొనేవాడు
ఎఱ్ఱకోటలో చేరి
ఏలుతున్నాడు !
ఉన్నోడు అన్నాడు
లేనోడు అన్నాడు
జుట్టుముడి వేసి
మనపట్లు కొట్టేశాడు !
అమ్మబోతే అలుసు
కొనబోతె తెలుసురా !
దళారి దోపిడీ
ఈ ముండ మేలుబడి !

రైతు పంచాంగం

వేసువనే శకునం
పాలేరు లేవలా !
పెట్టాడు సాగా
చుట్టాను పాగా !
పొద్దున్నే కుస్తీ
ఆఖరు కిస్తీ !
శిస్తు అదనం
ఏదో కథనం !
మధ్యాన్నం నూర్పిడి
ఏమిటీ దోపిడి ?
ఎకరా ముప్పైరాలినా
నికరం పాతికేనా !
సాయంత్రం వార్త
ధర తరిగింది !
అర్థరాత్రి కల
లాభనష్టాల వల !

ఖానీలు

అతి పెద్ద సోపంట
ఈ భూమిపై మనది !
అమెరికా అన్దంట !
రష్యా విన్దంట !
బుఱ్ఱకో ఓటుంది
గొఱ్ఱెకో ఓటు !
బఱ్ఱెకో ఓటుంది
జుఱ్ఱుకో ఓటు !
అమెరికా అంటేను
గరికంటదీ గొఱ్ఱె !
రష్యా అంటేను
రహాశమంటది బఱ్ఱె !
వినాయకుల చేతి
అమాయకులార !
ఇదికాదురా ఓటు
తిప్పికొట్టే ఈటె !

పరిహాసం

కోటి విద్దెల పొడవు
కొండ్ర వేశానంటె
నెత్తి కెక్కిన పొద్దు
పోద్దాఁలు పోవాల !
సుత్తి నెత్తినవాడు
నెత్తినే మొత్తుకొనె !
ఎద్దు నెక్కినవాడు
ఎల్లికిల పడ్డాడు !
హాలము పట్టినవాడు
కాడి కిందేశాడు !
కలము పట్టినవాడు
ఊసైన పలికాఁడ ?
కోటి విద్యలు కూడ
కూటికే నంటారు
కూడెట్ట పుట్టేనా
ఒక్కడికి గుర్తుంద ?

వేరు

డొంక తిరిగేకాడ
మావిచెట్టూ నీడ
రైతులందరు చేరి
తింటాడు తిళ్లు!
ఎండలో ముసలాడు
పోరాడు తున్నాడు!
చెట్టునీడకు రాడు
అసలు కూడే లేడు!
ఎదిగొచ్చి కొడుకులు
వేరుపడి పోయారు!
ముసలాడి ఆలికి
కాలు పడి పోయింది!
ఒక్కయిల్లే పగిలి
ముక్కలన్నీ మిగిలి
దేశమే అయ్యింది
దారిలేకా వుంది!

స్వయంకృతాలు

డొంక దున్నేశాడు
దారి లేదన్నాడు !
కాళ్ళు నెత్తినపెట్టి
చేని కొస్తున్నాడ?
వల్లకాడే కలిపి
వల్లగా దన్నాడు !
ఊరకుక్కలు వాణ్ణి
పీక్కు తినాలా ?
వనాలు నరికారు
వాన లే దన్నారు !
వన మహోత్సవా లంట
ఊళ్ళు అడవులు సేయ !
ఉన్న కొమ్మే నరికె
దున్నపోతూ పనులు !
ఎన్నాళ్ళు సాగురా
విస్సన్న వాదాలు ?

పాలపుంత

సరిగంచుల పంచపైన
అరచేతుల చొక్కాతో
చేతిలోన కఱ్ఱ పట్టి
నిండుగ నే నడిచేను !
వీపైన తుపాకిలా
వెనకెవరో గోణిగారు !
ఎలావుంది వీడి చేను
నిరుటిలాగ ఏడిశిందఁ ?
కంకిగుత్తి కండెపొత్తి
మచ్చుకు నే తెస్తుంటే
మళ్లొంటుందా గొంతే
ఇలావుంద చేనంతా !
జొన్నపొత్తి కంకిగుత్తి
పందిట్లో యాలగట్టి
దూడ నాకు చూడనావు
సందిట్లో జున్నుగడ్డ !

హద్దులు

బంగారమూ మట్టి
బతుకు యింతేనా ?
బరువైన పరువైన
బ్రతుకు మనకొద్దా ?
గట్టు కేసిన రాయి
మనకు పోలేరమ్మ !
రిత్తవై పీకావా
మిత్రవై మింగేను !
వామి యెత్తును చూసి
గోమాత పులకించి
తన లేగదూడతో
ఊసులే పలికేను !
వామి తగలెట్టావా
గో వుసురు కొట్టేను !
రాత గీసినవాడు
మేత వేయక పోడు !

నాగరిక లక్షణం

వంటినిండ కండలుండి
కంటినిండ పండుకుంటె
బలమంతా యీడుబోద ?
బ్రతుకంతా పాడుగాద ?
ఉత్తిగానె పడుకుంటె
కొత్తకలలు వొస్తాయి !
అడ్డదారి వెతికేడు
దొడ్డిదారి పట్టేడు !
పగలంతా కష్టపడితె
రేయంతా నష్టపడదు !
కండలన్ని కరిగిపోయి
గుండెల్ని విసురుతాయి !
కష్టంతో గూడుకట్టు
పట్టుమెంత దీనికింద ?
వదలగొట్ట వస్తాడు
తగలబెట్ట చూస్తాడు !

ఆదర్శం

గోతాము పడుతుంటె
ఊపి తేలతా వుంది !
కసరత్తు అనుకుంటె
గమ్మత్తుగా లేద ?
ప్రతి మనిషికీ రోజు
కసరత్తు కావాలి !
కష్టమను కున్నది
కసరత్తునే కాద ?
పొద్దు బారెక్కింది
సద్ది వస్తా వుంది !
పిడికెడేసీ కుడుము
పుట్టకొక్కుల కూర!
కర్మసాక్షీ చూడు
నిత్యమూ వస్తాడు !
అలిశాడ ? పులిశాడ !
అరిగి పోయాడా ?

రైతు రాజ్యం

నా దొక స్వర్గం
దూరం కాదు ద్వారం
తపస్సు కావాలన్నా !
కష్టమని నే నన్నా !
దానికి రాజును నేనే !
రైతుని నే నన్నా !
మంత్రొక డున్నాడు
జీతగాడని నే నన్నా !
యుద్ధం యెప్పుడూ వుంది
సేద్యమని నే నన్నా !
సైన్యం కూడా వుంది
కూలీలని నే నన్నా !
నా స్వర్గంలో
స్వేచ్ఛ మహా బరువు !
నా దుర్గంలో
దాస్యం బహు కరువు !

పరిష్కారం

రచ్చ బండకు రండి
రగడ తేలుద్దాము !
మనసుండగా మనకు
మార్గమే లేకుంద ?
కూలైన రైతైన
కొదవ లేకుండాల
వృత్తి మన కేదైన
కొంత మిగలాల !
ఉన్న వాడొక నాడు
లేని వాడేగా !
లేని వాడొక నాడు
ఉన్న వాడేగా !
కలిమి కోసం మనం
కష్ట పడదాము !
హెచ్చు తగ్గులు వస్తె
ఆంక్ష పెడదాము !

పోకిళ్లు

ఎల్లెద్దు పుల్లెద్దు
గిల్లి కజ్జా లాడు !
అల్లంత దూరము
గల్లంతుగా మొగురు !
దూరాన నను చూసి
దరువంత మార్చేరు !
ఒకరి కొకరూ వారు
గీరు కుంటన్నట్టు !
ఏమిటీ వరసంటు
నవ్వు కుంటా వుంటె
చంటి బిడ్డల మల్లె
చంక కొచ్చేస్తారు !
మట్టినే దున్నేరు
మాగాని చేసేరు !
చర్మ మొలిసీ మనకు
చెప్పులే కుట్టేరు !

జతగాడు

జీతగా డెవడురా ?

జతగాడురా వాడు !

జీవితానికి తోడు

త్యాగానికీ యీడు !

అతడు తోలే యెద్దు

తోక జాడించినా

కాడి మెడ నేసుకోని

నాగ లీడుస్తాడు !

దొర గారు వాడంటె

దుర దెత్తి పోతున్న !

'బాబయ్యా' వాడంటె

బరువెత్తి పోతున్న !

పెద్ద కొడు కంటాను

ముద్దెట్టు కుంటా !

జ్యేష్ట భాగం యిచ్చి

జోగొట్టు కుంటా !

వేదాంతం

రెక్కాడితే గాని
డొక్కాడ దోయి !
చిక్కు పెడితే గాని
చక్క బడ దోయి !
బంగార మెవ డైన
అరిగించు కున్నాడ ?
డబ్బు తిని యెవ డైన
ధరణి యేలాండా ?
తెలియకే వాడెవడో
విలువ గట్టాండు !
ఆక లంటే జీవి
ఆయువే నోయి !
పంచ భూతము లన్ని
ప్రాణి కవసరము !
ఆరవ భూతమ్ము
ఆహార మేరా !

తీర్పు

ఎద్దుల్లారా ! ముద్దుల్లారా !
దూతల్లారా ! దాతల్లారా !
దూకండి వడిగా
సాకండి జనులా !
సోమరి పోతుకు
సంఘ ద్రోహికి
గడ్డెయ్యాలండీ !
మీకు యిడ్లీ లడ్లండీ !
సమ్మెకు పోరు
చట్టం తేరు !
మీరే ఘనులండీ !
మా పనులే వేరండీ !
మాటలు నేర్పి
మనిషిని గూర్చి
తీర్పింమ్మంటే
మీరే మంటారో ?

పిలుపు

కూలీలు ! పాలేళ్ళు !
రండి ! రండి ! వురికి !
ఏదీ మన వునికి ?
రండి ! రండి ! పనికి !
ఎవ్వరిదీ పాపం ?
ఎక్కడుందీ లోపం ?
మానవుడి బుద్ధి లోనా ?
వాడెక్కిన గద్దె లోనా ?
కిరాయి గుండె
పరాయి తిండి
వద్దు వద్దు
అద్దె బతుకు !
గుర్తు లేద చేతి లోది ?
ఆయుధం ! వజ్రాయుధం !
నీతికీ ప్రగతికీ
నిల బడదాం ! కల బడదాం !

కాకమ్మ కథ

మనుషుల తత్వం
మాన వత్వం
మనసులు విరిసిన
మాధుర్యంరా !
హద్దులు వేసి
కొద్దిది చేసి
అమ్మకోను
సొమ్ము కాదోయ్ !
త్యాగం ఒక
రోగం అయితే
మనిషికి మన
సెందుకుందో ?
ఆహారం
చూసిన కాకి
అందరినీ
కేఁ కే స్తుందోయ్ !

పాల గుండెలు

పొలిమే రావల
కరువును తోలి
ఎద్దులతో ఆడుకుంట
హద్దు లేక పాడు కుంట !

పాతాళ గంగ
పై కుబ కంగ
మబ్బు లన్ని గింజు కుంటె
ఆకల్ని నంజు కుంట !

ఇది పురిటి గడ్డ
నేను రైతు బిడ్డ
నేల గుండెలా కొండలు
పాల కుండలా గుండెలు !

అదో భూదేవి
నిదర బోత్తో
చను కట్టు ముడి
సల్లగ విప్పు కుంట !

ఇల్లాలి కలిమి

మేడయితే మాటు కేమి ?

అంతస్తు లయితేమి ?

ఎండ పడతా వుండు

నీడ మొడతా వుండు !

అక్కడే పెరగాలి

కొత్తిమేర గోంగూర

గాంబేజి కాలిపువు !

మెంతాకు యెంతైన !

పూలు కావాలన్న

ఊలు తేవాలన్న

ఇల్లాలి మనసులో

కూరలే మిన్న

కనలేని కొలువులు

ఎనలేని విలువలు

పెట్టెలో పెట్టయిన

మట్టి కివ్వాలి !

బారెడు బిడ్డ

అరువైన అరుదైన
ఎరు వేసుకున్నాను
నెత్తురే తాపాను
పైరు సాకాను !
పిండి వెన్నెల వేయ
మంచు తడిపింది
వాన నీళ్లోసింది
ఎండ తుడిచింది !
ఒంటిలో శక్తంత
కుదగట్టుకున్నాను
ఇంటిలో సొమ్మెల్ల
ఎద పెట్టుకున్నాను !
కొడవలంతై కంకి
పాలు పడతా వుంది
సంద్రాన తుఫాను
కాలు పెడతా వుంది !

ఇంటి సోకు

నిత్య కళ్యాణమ్ము
పచ్చ తోరణము !
కాదటోయి యింటి
ప్రతి ప్రాంగణమ్ము !
పచ్చగా గడ్డల్ల
పెట్టు కుంటావే !
గడ్డి దేముందోయి
గొడ్డు బోతైతే ?
సొర పక్కనా బీర
బచ్చ లెమ్మట బెండ
ఇంటి పందిటి గుంజ
దొండ తోడగాల !
చేనులో యిల్లుందా ?
ఇంటిలో చేనుందా
అంతు లేకుండాల
అక్కడే వుండాల !

గో పూ జ

బండిలో ఇల్లాలు
పురుగు పొంగలి సేలా
పెట్ట బోతం దంట
యడ్ల గుస గుసలు !
కళ్ళు సాలవు సూడ
సిన్నోడి పెళ్ళాన్ని
రాసోరి బిడ్డంది
ఊరు మురిసింది !
పాలిగాడి కేకలో
భూ దేవి మేలు కొని
సిరు లొలుకు నవ్వుల
పలక రిస్తోంది !
పతాణపు చీర
జీరాడ పూబోణి
చేత పళ్లెర మూన
గో మాత పరుగెత్తె !

సాల భంజికలు

చుట్ట కాల్చుకుంటూ నే
చెట్టు కింద కూచుంటే
ఏనుగులు మేస్తున్నట్టే
ఎదురుగా వున్నై కొండలు !

ఆ పక్కన పిల్లాడు
పిట్టలు తోల్తున్నాడు
వడిశాల్తో రక రకాల
కేకల్రువు తున్నాడు !

పోట్ల గిత్త లీ పక్కన
కుస్తీల్పడు తున్నాయి !
ముసిలివి బీటిలో
ఉసి కొల్పు తున్నాయి !

జడ్డిగం కోప్పెట్టి
జొన్న కర్ర ఆడతంది !
చేతిలో కొడవ లెత్తి
పల్లె పడుచు పాడతంది !

గడ్డు ప్రసూతి

ముందు కెలితే రాదు
వెను దిరిగితే పోదు
ఉయ్యాల వూపింది
దయ్యాల కొండ !
ఉరుముకే దడుసుకునె
కొంగలకు లొంగునా ?
వంక వంకల డొంక
చేల కడ్డం పడగ !
మెరుపు కాలిందేమొ
గాలి చిందే సింది !
మబ్బు తడిపిం దంటె
బొబ్బ లెక్కే నంట !
ఊత కొచ్చిన పైరు
లేత పడుచుకు మల్లె
చే నెల్ల తన్ను కొన
మానల్లె నిలుచున్న !

—

ప్రస్థానం

కిందుండే అందుకొచ్చి
కొబ్బరి రొమ్ములు !
చూస్తోంది మిరప
బటాని గుడ్లతో !
కండె గడ్డం మూరెడు
అరటి జడ బారెడు !
పల్లి కంత చావంచి
నేల కొప్పున కాలి పువ్వు !
పొడుగుడు కోడిలా
ఆకుల ఈకల్లోకి
నేల్ని తాకే కాయల్ని
లాక్కుంది మామిడి !
వేంపలి చెట్టుకు
నిచ్చెన వేసినట్టు
మనసుంటే యిట్టే
ఎక్కొచ్చు ఒక్కో మెట్టు !

పసిడి దృశ్యం

చేల వంకా చూడ
ఆక లవటం లేదు
ఇంటి వంకా చూడ
వెళ్ల బుద్ధవటంలా !
ఆ వంతునే వుండి
పస్తులైనా పండి
చేలపై నా యోగ
వాల నీ కుండాలి !
చెలువు గట్టెక్కాను
చేలపై చూశాను
చేలన్ని పసిడీని
తల లొంచినాయి !
బారు బారచ్చులుగ
దారులే కోశాయి
బరువెంత తూగిందో
ధరణికే తెలిసుంది !

నవ్వులాట

సూరిపిడి దిగ బడది
కదల కెద్దుల్లార !
సూరీడు వొచ్చేడు
సురక వేసేడు !
ఒచ్చేడు కరువంట
పంచాంగ దాసరి
మాది గింటికి తోల !
కదల కున్నా రేల ?
కిఱ్ఱు చెప్పులు నాకు
తోలు కుచ్చులు మీకు
మాట తప్పొద్దంట
తెచ్చె పెద్దింటోడు !
ఎన్ని కడుపులు మాడొ ?
ఎంద రుడుపులు పీడొ ?
నవ్వు కుంటా రేల ?
రాశి రెండింతలా ?

సంక్రాంతి

సంక్రాంతి వచ్చింది
చేలోనె వుంది !
ఇంటికీ రానంట
చలి గాసు కుంట !
నిలువెల్ల నను చూసి
తెల్ల బోయింది !
అరిగి పోయిన చేతి
మురుగు తీమంది !
బారెడంతా బిడ్డ
బతికాను చూడు !
పురిటి వాసన పోల
ఊరేలనంది ?
వంట లెందుకు నాకు
పంట నే నంది !
గొబ్బిళ్లు తెమ్మంది
ముగ్గు చాలంది !

అలవోక

నింగి పందిరి కింద
నేలంత అరుగు !
సీతమ్మ గుండెలో
రామయ్యా పరుగు !
యల్లెద్దు పుల్లెద్దు
రథ మెల్లతా వుంది !
సీత రాముల పెళ్లి
కథ సెప్పుతా వుంది !
దారెంట శెట్టుల్లో
పచ్చు లాల కించ !
వాన వోస గట్టంలో
గొంతు గీ బోయింది !
ఇద్దరం అడిగేది
ఒకటే రామయ్యా !
మా ఆయువులు కలిపి
సెరి సగము సెయ్యా !

ఆత్మావలోకనం

పుస్కారాలకు మనవుఁ
పుర గోలుపు కెల్లాఁవుఁ !
పిండవేఁ సేటపుడు
గండవైఁ నాది !
నేల రాలిన యెద్దు
గుండెలో మోరెట్ట !
బేపనయ్యకు వాటి
గోత్ర వేఁవఁని సెప్ప ?
కాటు వేసే పావుఁ
దేహావేఁ దహానవాఁ ?
పాటు పడ్డా యెద్దు ?
పుట్టె వాఁవుఁల పైన
గురుతు రాటం లేద
పెద్దావు గో మాత
అనుకుంట వూరంత
ఉరిపోసు కేడ్సింది ?

నిరీక్షణ

క్రిష్ణ లో ముని గేసి
కొండలా దండాలు !
ఇళ్ళపై యిళ్ళెక్కి
ఊరు సూత్తుండాది !
కాలువలు వారోసి
లోయ పెవిఁ దల్లోన
తోయముల హారతులు
సుప్రభాతాలు !
నిండు శూలాలమ్మ
నిలుసుంది క్రిష్ణమ్మ !
కాళ్లు కడగా లంట
దిగిరావ దుర్గమ్మ ?
కుంటి గుడ్డోళ్లంట !
కొండ సిగ యిల్లు దిగు !
సుట్టూత ప్రకృతి
సూడ ముచ్చట గుంట !

ఎదరుసొద

జవరాలి యెద లోని
మరులు యేరుకు తింట
పొన్న మాసున జంట
పూలు రాలిన వంట !
సుక్కల్ని కళ్లట్టి
మంచమై పడుకుంటె
గాజు లన్ని మోగి
జల్లు మందనె వొల్లు
ఆ వంక నెల వొంక
కుంటుతా పోతంటె
సుక్క లన్ని పగిలి
ముక్కలైనా యంట !
ఆవు అరిసీ నట్టు
తాను వొచ్చి నట్టె
తలుపు తెరిసీ నేను
తల్లడిలి పోయాను !

నిరాశ

నేలకు వాల బడుతూ
నాలుక మెలి పెడుతూ
ఆవీస్తా వుంది ఆలస్యంగా
చావో! బ్రతుకో! సంశయంగా
ఉదయించే బిడ్డ
దున్నబోయే గడ్డ
కడుపులో బెణికి
గడగడా వణికె !
దూరంగా తీతువు
ఘోరంగా కూసింది !
మూడుసార్లు మొబ్బెట్టుగ
గుండె ఆగి పోయేట్టుగ !
ఆశ నిరాశామె !
ఏముంది స్థిరం ?
అంతా మాయ !
తీసి చూస్తే పెయ్య !

బొమ్మలు

మేడి పట్టిన వాడి
టీవియే వోలీల
సాలు సాలుకు నేల
పులకరించే యేల !
నింగి గుండెలు కదిలి
మబ్బు బొమ్మలు మెదిలె
దేవతా శిలపాలు
మేగ సందేశాలు !
బొమ్మ బొమ్మకు నన్ను
సొమ్ము లడుగుత వుంటె
తనకు తగ్గా యెద్దు
అవి కళ్ళు మూసేవి !
శిలిపి బొమ్మలు యిట్ట
సూపాల అనబోతె
ఆ పక్క నొక బొమ్మ
నిత్తెం వింది కాదంట !

నిర్వేద

సీకట్ల కురులలో
జాబిల్లి పువ్వా !
సీరం యెన్నెల జార
సూరీడు బొట్టూ !
ఇంద్ర పట్టం వూరు
కవితయే తన పేరు !
ప్రకృతి దాగుడు మూత
పుష్పావనైతే తాను !
సేల శెంగుల మడిసి
పూల వాసన గాలి
వెదురు అందెల రవళి
యేటి గలగల మురళి !
మురళి రవళీ సరళి
ఆడు తుండది గుండె !
కొండ కన్నుల గుండ
సెలయేటి జలకారు !

విశ్వ ఘోష

ఇంకెప్పుడు ఈ గడ్డన
పుడమికి నెల తప్పేది
పన్నీటిని చిలికేది
కన్నీటిని తుడిచేది ?
ఇంకెప్పుడు ఈ గడ్డన
ఒక నుయ్యి
ఒక పొయ్యి
వసుధైక కుటుంబకం ?
ఇంకెప్పుడు ఈ గడ్డన
శాంతి
కాంతి
సంక్రాంతి ?

ఎప్పుడైన
ఈ గడ్డకి
అట్టి శక్తి
పుట్టు రక్తి !

నెమరు

ధరలు పెరగను లేదు
దమ్మిడికి పని లేదు !
ధాన్యమే అన్నిటికి
దర్జాగ జరిగేది !
పొలము పనులే కాదు
ఊరి పనులని లేదు
అన్న దమ్ములు కదులు
ఇగురు పొరుగూ బదులు !
మెట్టివాడీ పెళ్లి
ఊరికే పెళ్లిరా !
సదివింపు లంటేనె
సే బదులుగా లేద ?
కమ్మరి కి కుమ్మరి కి
సాకలి కి మంగలి కి
అన్నీ మిరాశీలె
నోటి మాటే పూసి !

పాలకులారా !

ప్రజలె పాలకులకు
బిడ్డ లంటారు
పాలకులె ప్రజలకు
తండ్రు లవుతారు !
పిట్టకే వొక తండ్రి
త్రొడ కోసి యిచ్చాండు !
తండ్రికై వొక బిడ్డ
అడివి కెళ్లాండు !
తారు మారూ సూడ
మారు వేసము లేసి
తప్పు దిద్దే వోరు
తమ తప్పు లెరిగి !
తండ్రి శక్కరవరితి
బిడ్డ దరిద్దుడా ?
యేదైన వురికేర
ఇది కర్మ భూమిఁ !

దోహులారా!

కడుపు మంటా కోద్ది
ఏవిటో అన్నాను
బిడ్డ బిడ్డాంతరవుం
కచ్చి పట్టా వొద్దు!
ఒకడి సొమ్మూ ముట్ట
ఒక డాలిసీ పట్ట
మెంగిలి కూడదది
గుండె సెపటం లేద?
మిమ్మనే పని లేదు
కాలవేఁ కలసిరా
దోహులే సంగవైఁ
హక్కు లడిగేరు!
ఉరి శిచ్చ రద్దయిన
యే శిచ్చ పడినా
ఒక శిచ్చ వుండాది
అది అంతరాత్తమ!

—

కహా లీ లహా !

మనవుఁ మెలిగా వఁయ్యా
తండి బిడ్డల మల్లె
పస్తు లైనా పండి
పండగను కున్నావుఁ !
బంది పోటూ అంటె
దొంగ పని యని నేను
సావు కారుకు సెప్పి
సే బదులు యిప్పిచ్చుఁ !
పంట లొచ్చే దాక
పనులు లే వంటేను
మనకు తగ్గా పనులు
కలిపించి బతికించఁ!
అన్ని పనులూ మరలె
సేసు కెలతా యంట
కాలు సేతులు రెండు
నరి కేసి నట్టేర !

ఎద్దా !

యెట్ట బతికే వోణ్ణో
అడివిలో పట్టాను
నిన్ను శడ గొట్టాను
నన్ను శమియించూ !
అడివి కెల్లొద్దింక
ఈడనే వుండూ !
అడివి మనిసై నరుడు
ఆడ సేరేడూ !
అమ్మ న్నుంచు తారు
నిన్ను తింటా రేవోఁ?
ఇట్టవుతా దనీ
నేను అనుకో లేదు !
పొగ బండి వొచ్చింది
పొలము దున్ను తోంది !
నా యింటి ముందు నువు
నందిగా వుండూ !

ప్రేయసీ!

గుండెలో తలదూర్చి
యేవిఁటా సింతా ?
నా కడుపులో యేదో
కదలాడు యింతా !
బిడ్డలూ బిడ్డలూ
యేవిఁటీ తంటా ?
మనవఁళ్లతో మనవుఁ
ఆడుకో నంటా !
ముసిలోళ్ళ వైఁ నాక
యేవిఁటా ఆటా ?
సేయితాలై మనవుఁ
సేసినవి ఆటా !
తనివిఁ తీరా లేదు
ఇంతేన బతుకూ ?
జనమ జనమకు మనవుఁ
యింతేలె సాలా !

కరం వేరు

నీ వెన్నెముక రా
నా పెన్ను !
నింపుతుంది సిరా
నా కన్ను !
పెట్టాను దానికి
నీ పేరు !
నీతోనే మారిందిగా
దాని తీరు !
చూశావా ?
నా గేద్రం !
చెరిపేశా !
"ఐం ద్రం" !
ఇది వరకు పేరాది
చూసే వుంటావులే యిది !
పోతానంటే పోనిస్తానా ?
శాశ్వితంగా బ్రతికిస్తాను !

ఊరడింపు

ఋణావుఁ లుంటాయంట
తీర్సు కోవాలంట !
మల్లి మల్లీ పుట్టి
యెల్లి పోతా మంట !
సిత్తి విఁరిగి పోతె
యిసిత్ర మవుతాది !
యెద గూడు గట్టినా
పొద యెగిరి పోతాది !
కల్లోలమే పాటె ?
కలతలే శత కోటి !
పిన్న మనసూ మనది
పెన వేస్కుంటాది !
గుండె వూపున బండి
తోసు కెల్లాలంతె !
మల్లి మల్లీ పుట్టై
బంధవేఁ తెగుతాది !

ప్రతిజ్ఞ

రెక్కలు ముక్కలు
డొక్కలు ఒక్కటై
మెతుకు కోసం
మేడే పడతా !
దొంగా తుంగా
ఋణమే వ్రణమై
బతుకు కోసం
బండే కడతా !
వర్షం వృషభం
కరువై బరువై
ఘర్మ జలం పారిస్తా !
నాగలి నే నీడుస్తా !
ధాత కరువుదే
డొక్క నమిలి నే
పుట్ట కొకుక్కలా
నిక్క బొడవలా ?

ముఖప్రకటన

అశరీర వాణి

నా బాణి !

నిత్య కల్యాణి

నా మాగాణి !

ఎద్దు దేదో

పొడిచే వాణ్ణి !

పేడకళ్ళు

తుడిచే వాణ్ణి !

కరకాయ

గుండెకాయ

గొంతు కడ్డం

పడుతున్నాయ్ !

ఎందుకు

తపిస్తానో ?

ఎవణ్ణి

శపిస్తానో ?

శ్రీ హరనాథ్ ప్రెస్, 16/37 సత్యనారాయణపురం, గుడివాడ.

"ఇన్నాళ్ళకు శ్రీ నాగేశ్వరరావ్‌గారి "రైతు రాగం" చదువుతుంటే ఆ సత్కవుల సరసన సగర్వంగా విలవదగిన రచన చేశారనే ఆనందమూ పాడటానికి అనువైన రచనా విన్యాసం. సంతృప్తీ కలుగుతున్నాయి. సులువైన మాటల్లో విలువైనభావాలు పలికించగల చాతుర్యం. పదకవితకు ప్రాణసమానమైన మాధుర్యం, సంయమనం. అల్పాక్షరాలతో అనల్ప మైన శబ్దచిత్రాలను కళ్ళకు కట్టించే నైపుణ్యం".

—అమరేంద్ర